
భార్యతో వివాహేతర సంబంధం.. మేనల్లుడిని
కారుతో ఢీ కొట్టి చంపిన మామ
7
సుపారీ గ్యాంగ్‌తో హత్యకు ప్లాన్
● ఎనిమిది మంది అరెస్టు





# చెరకు టన్నుకు రూ.500 బోనస్ ప్రకటించాలి

**చెరకు రైతుల సమస్యలను మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ సురేష్‌శెట్కార్‌లకు వివరించిన నిర్మలాజగ్గారెడ్డి**



చెరకు రైతుల సమస్యలను మంత్రి శ్రీధర్‌బాబుకు వివరిస్తున్న నిర్మలాజగ్గారెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ సురేష్‌శెట్కార్‌తో నిర్మలాజగ్గారెడ్డి, సీడీసీ చైర్మన్‌లు

సంగారెడ్డి టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని చెరకు రైతులకు రూ.500 బోనస్ ప్రకటించాలని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి కోరారు. శనివారం రాష్ట్రంలోని ఏడుగురు సీడీసీ చైర్మన్‌లతో కలిసి జహీరాబాద్ ఎంపీ సురేష్‌శెట్కార్, రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబును నిర్మలాజగ్గారెడ్డి కలిసి చెరకు రైతుల సమస్యలను వివరించారు. చెరకు రవాణా కోసం టోల్‌గేట్ రుసుం మాఫీ చేయాలన్నారు. సీడీసీల ద్వారా నిధులు మంజూరు చేసి యాంత్రీకరణ పథకాన్ని అమలు చేయాలన్నారు. పరిశ్రమలకు చెరకును సాఫీగా రవాణా చేసేలా అంతర్గత రోడ్ల నిర్మాణానికి నిధులు సమకూర్చాలన్నారు. చెరకు రైతులకు డ్రిప్ ఇరిగేషన్ కోసం నిధులను కేటాయించాలని నిర్మలాజగ్గారెడ్డి సీడీసీ చైర్మన్‌ల పక్షాన మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ సురేష్‌శెట్కార్‌లను కోరారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి, గాయత్రి, గణపతి, మధుకాన్, కాకతీయ, కృష్ణవేణి, గంగా కావేరి చెరకు పరిశ్రమల పరిధిలోని సీడీసీ చైర్మన్‌లు తదితరులు పాల్గొన్నారు.

# ప్లంబర్ల కమాల్‌పూర్.. పెయింటర్ల షేర్‌పల్లి

7లో

## ఇంటికొకరు చొప్పున ఊరంతా వారే

ఉపాధి కోసం వలస వెళ్లి.. పని నేర్చుకుని వచ్చి

తమ గ్రామస్థులకు దారి చూపిన వృత్తిదారులు

భవన నిర్మాణ కార్మికులుగా గుర్తించి, బీమా, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి



రంగులు వేస్తున్న పెయింటర్లు



ఓ ఇంట్లో ప్లంబింగ్ పనిచేస్తున్న కమలాపూర్ గ్రామస్థుడు



నిర్వాసితులతో కలసి ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

# గౌరవెల్లి అడ్డంకులన్నీ తొలగుతున్నాయి

- త్వరగా రిజర్వాయర్ పనులు పూర్తి చేస్తాం
- నిధులు ఇవ్వడానికి సీఎం రేవంత్ అంగీకారం
- సమస్యల పరిష్కారానికి మంత్రి ఉత్తమ్ హామీ
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం

హుస్నాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మెట్ట ప్రాంత వరప్రదాయిని గౌరవెల్లి రిజర్వాయర్‌కు ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోతున్నాయని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శనివారం ఆయన గౌరవెల్లి రిజర్వాయర్‌పై హైదరాబాద్‌లోని జలసౌధలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ విషయంపై ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రిజర్వాయర్‌లోని 55 ఎకరాలకు సంబంధించిన నిర్వాసితులను మంత్రికి కల్పించామని, వారి సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారన్నారు. ఈ రిజర్వాయర్‌కు సంబంధించిన లీగల్ సమస్యను ఇటీవల సుప్రీం కోర్టు పరిష్కరించిందన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టులో నీళ్ల నింపడానికి కాలువలు తవ్వడానికి, భూసేకరణకు అవసరమైన నిధులు ఇవ్వడానికి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం విక్రమార్క, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంగీకరించారని వెల్లడించారు. వీలైనంత త్వరగా ప్రాజెక్టు పనులన్నీ పూర్తి చేయబోతున్నామని, కాలువల నిర్మాణానికి అవసరమైన భూ సేకరణకు రైతులు సహకరించాలన్నారు. లక్ష ఎకరాలకుపైగా ఆయకట్టు ఉన్న ఎత్తయిన పీఠభూమిలో ఉన్న గౌరవెల్లి పూర్తి చేసే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. మాజీ సీఎం దివంగత వైఎస్ఆర్ శంకుస్థాపన చేసినప్పటికీ, కుర్చీ వేసుకొని కడతామని కేసీఆర్ చెప్పిన ప్రాజెక్టు కూడా ఇదేనన్నారు. దీనిపై ఎవరిని నిందించకుండా ఇచ్చిన మాట ప్రకారం ఈ ప్రాంత రైతాంగానికి నీళ్ల ఇచ్చే కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

# సర్కారీ ఉద్యోగుల సిండికేట్..!

**మద్యం దందాలో భాగస్వామ్యం.. విధుల కంటే వ్యాపారాలకే ప్రాధాన్యం**





ఒప్పంద పత్రాల్లో పచ్చ ఇంకుతో సంతకం?

కలెక్టర్ చెంతకు పత్రం?

షాపులు దక్కించుకునేందుకు గుడ్‌విల్

బినామీ.. భాగస్వామ్యం పేరిట దందా

వినని వారికి అధికారుల నుంచి ఒత్తిడి




సిండికేట్ ఒప్పంద పత్రం

దుబ్బాక, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కొందరు ఉద్యోగులు సైడ్ బిజినెస్‌లో బిజీగా ఉంటున్నారు. ఆదర్శంగా ఉండాల్సిన వారే అక్రమ దందాల్లో మునిగితేలుతున్నారు. మద్యం సిండికేట్లలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటూ కార్యాలయ విధుల కంటే తమ వ్యాపార విధులకే ప్రాధాన్యం ఇస్తున్నారు. బినామీ పేర్లతో కొందరు.. తమ సతీమణుల, బంధువుల పేర్లతో అక్రమ వ్యాపారాల్లో భాగస్వాములుగా మారడం వివాదాస్పదంగా మారింది. ఓ గెజిటెడ్ అధికారి మద్యం సిండికేటులో కుమ్మక్కవడంతో పాటు సదరు వ్యాపార సిండికేటు ఒప్పంద పత్రంపై పచ్చ ఇంకుతో సంతకం చేసి, పక్కనే హోదా కూడా రాయడం చర్చనీయాంశంగా మారింది. ఈ పంచాయితీ కాస్త కలెక్టర్ దృష్టికి చేరినట్లు సమాచారం.

### సిండికేటులో కీలకం..

జిల్లాలో మద్యం సిండికేట్‌లో కొందరు ఉద్యోగులు చక్రం తిప్పుతున్నారు. ముఖ్యంగా దుబ్బాకలో మద్యం దుకాణాలను వివిధ రిజర్వేషన్ల ప్రకారం కేటాయించగా, దానిని అదనుగా తీసుకుని కొందరు ప్రభుత్వ ఉద్యోగులు తమ బినామీలను రంగంలోకి దింపారు. రిజర్వేషన్ వర్తించే వర్గానికి/వ్యక్తి వెనుకుండి ఆర్థికంగా చేయూత నిచ్చి తతంగం నడిపించారు. లక్కీ డ్రాలో దుకాణం దక్కిన తర్వాత అర్హుడైన అతడిని పక్కకు జరుపుతున్నారు. దుకాణం దక్కించుకున్న వారిని అవసరం అయినప్పుడు సంతకాలు పెడితేచాలని గుడ్‌విల్ లేదా తమ వద్ద ఉద్యోగిగా చేర్చుకుని అక్రమ దందా నడిపిస్తున్నారు. ఇందులో కొందరు తమ వారి పేరిట దుకాణం దక్కించుకున్న వ్యక్తి నుంచి ఒప్పంద పత్రాలు రాసుకుంటుండగా, కొందరు ఏకంగా తమ పేరిటే ఒప్పంద పత్రాలు రాయించుకుంటున్నారు. ఇటీవల దుబ్బాకలో నాలుగు మద్యం దుకాణాలు పొందిన వారి నుంచి ఓ మండల విద్యాధికారితో పాటు పలువురు ఉపాధ్యాయులు, ఓ ఈజీఎస్ ఉద్యోగి ఇలా అనధికారికంగా మద్యం దుకాణాల్లో భాగస్వాములుగా మారారని గుసగుసలు వినిపిస్తున్నాయి. సిండికేట్‌గా మారిన ఈ మద్యం వ్యాపారులు చేసుకున్న ఒప్పంద పత్రంపై

మిగతా 8వ పేజీలో

## డీసీసీ అధ్యక్షురాలిగా తూంకుంట ఆంక్షారెడ్డి

గజ్వేల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా తూంకుంట ఆంక్షారెడ్డి ఎన్నికయ్యారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, ఇప్పటివరకు డీసీసీ ప్రెసిడెంట్‌గా ఉన్న తూంకుంట నర్సారెడ్డి కుమార్తె ఆంక్షారెడ్డి. ఆమెను డీసీసీ అధ్యక్షురాలిగా నియమిస్తూ ఏఐసీసీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సిద్దిపేట జిల్లా అధ్యక్ష పదవి కోసం 122 మంది దరఖాస్తు చేసుకోగా, ఆంక్షారెడ్డిని అదృష్టం వరించింది. గతంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా పనిచేసిన ఆమె ప్రస్తుతం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా పనిచేస్తున్నారు. కాగా సిద్దిపేట జిల్లా ఏర్పడినప్పటి నుంచి తూంకుంట కుటుంబానికే డీసీసీ పగ్గాలు దక్కడం గమనార్హం.



తూంకుంట ఆంక్షారెడ్డి

ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడి మృతి
● కుటుంబసభ్యులు, బంధువుల ధర్నా
7

# మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

- అన్ని రంగాల్లో వారికి ప్రాధాన్యమిస్తున్న రేవంత్ ప్రభుత్వం
- రాష్ట్ర కార్మిక శాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి

సిద్దిపేట/గజ్వేల్/దుబ్బాక, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయంలో, గజ్వేల్ పట్టణంలోని ఐవోసీలో, దుబ్బాక ఐడీవోసీలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయా నియోజకవర్గాల మహిళలకు శనివారం ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలు ఇంటిని చక్కదిద్దడంతో పాటు సమాజంలో కూడా వివిధ పనులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని, వారు మల్టీ టాలెంటెడ్ వ్యక్తులుగా రాణిస్తున్నారని ప్రశంసించారు. అన్ని రంగాల్లో మహిళా శక్తిని పెంచాలన్నది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ఆకాంక్ష అని తెలిపారు. మహిళలు ఎంపిక చేసిన డిజైన్లు, రంగులతో సుమారు రూ.800 విలువైన నాణ్యమైన చీరలను రూపొందించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలకు, నియోజకవర్గానికి దాదాపు 50 వేల ఇందిరా మహిళా శక్తి చీరలను అందించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోలుబంకు ఏర్పాటును వేగవంతం చేయాలని, ఇది ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలవాలని ఆయన కలెక్టర్‌ను ఆదేశించారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో పావలా వడ్డీ రుణాలను మంజూరు చేయగా, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి మరింత చొరవ తీసుకొని వడ్డీ లేని రుణాలను అందిస్తున్నారన్నారు. జిల్లాలో రూ.28 కోట్ల వడ్డీ లేని రుణాలను అందిస్తామని ప్రకటించారు. దుబ్బాకలో ఇప్పటికే మహిళా సంఘాలు రూ.6 కోట్లను సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. మహిళలందరూ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్మిక శాఖ తరఫున సిద్దిపేటలో మహిళా సెల్ఫ్ డెవలప్‌మెంట్ కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.



సిద్దిపేటలో మహిళకు చీర అందజేస్తున్న మంత్రి వివేక్

### మరో విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం

జిల్లాలో 11 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు బేస్‌మెంట్ స్థాయి నిర్మాణం పూర్తి చేసుకున్న 9 వేల ఇళ్లకు రూ.లక్ష చొప్పున చెల్లించామన్నారు. ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకొని, జాబితాలో పేరు రాని వారికి వచ్చే ఏడాది మరో విడత సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గాలకు 3,500 ఇళ్ల చొప్పున అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.హైమావతి మాట్లాడుతూ మహిళలు శక్తి స్వరూపులని, తలుచుకుంటే ఏదైనా సాధించగలరని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీఆర్డీవో జయదేవ్ ఆర్య, సిద్దిపేట ఆర్డీవో సదానందం, మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



సెల్ఫీ దిగుతున్న మహిళ

## నేడు మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష

సిద్దిపేట కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షను ఆదివారం జిల్లా వ్యాప్తంగా 9 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9.30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 1,723 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్ష సమయం కంటే గంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. సిద్దిపేటలోని బాయ్స్ హైస్కూలు, బాలికల ఉన్నత పాఠశాల, గవర్నమెంట్ న్యూ హైస్కూలు, ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. గజ్వేల్ ముట్రాజ్‌పల్లిలోని తెలంగాణ మోడల్ స్కూల్, గజ్వేల్ బాలికల హైస్కూలును కేటాయించారు. అలాగే హుస్నాబాద్ జడ్పీహెచ్ఎస్, హుస్నాబాద్ బాలికల పాఠశాలలో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. హాల్‌టికెట్‌లను ఆన్‌లైన్‌లో ఉన్నాయని తెలిపారు.





## పిల్లలతో పిక్నిక్

సిద్దిపేట జిల్లా దుద్దెడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకులు పిల్లలు వారి తల్లులతో కలిసి ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ డేలో భాగంగా శనివారం సిద్దిపేట అర్బన్ పార్క్‌కు విహారయాత్రకు తీసుకువచ్చారు. ప్రకృతి ప్రాధాన్యతలను తెలియచేయడంతో పాటు పిల్లలతో ఆటలు ఆడించారు. ఇలాంటి విజ్ఞానయాత్రలకు తీసుకువెళ్లడం ద్వారా పిల్లల్లో చురుకుదనం, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకులు తెలిపారు.

- జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి)

# అభివృద్ధిలో కలిసి నడుద్దాం

- భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

చేర్యాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాజకీయాలు ఎన్నికల సమయంలోనే ఉండాలని, ప్రజా సంక్షేమం కోసం మాత్రం అభివృద్ధిలో కలిసి అడుగులేయాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం చేర్యాల పట్టణ శివారు బీడీ కాలనీ సమీపంలో రూ.8.70 కోట్ల వ్యయంతో చేపట్టిన ప్రభుత్వ ఆస్పత్రి నూతన భవన ప్రారంభోత్సవంలో ఎంపీ చామల, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే ఇద్దరూ.. చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో త్వరలో డయాలసిస్ సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేయాలని కలెక్టర్ హైమావతిని కోరారు. అలాగే, పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులకు ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమలోను పాలుపంచుకున్నారు.

### కరచాలనం.. పలకరింపు

ఆస్పత్రి శిలాఫలకం ఆవిష్కరణ సమయంలో ఎంపీ చామల, ఎమ్మెల్యే పల్లా ఒకరి పట్ల మరొకరు ఆప్యాయంగా పలకరించుకోవడంతో పాటు, చేయి చేయి కలిపి కరచాలనం చేసుకున్నారు. సుహృద్భావ వాతావరణంలో వారి పర్యటన సాగింది. కొంతకాలంగా చేర్యాలలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయంగా భగ్గుమన్న పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో ఈ కలయిక ఇరు పార్టీల నాయకులు, ప్రజల్లో ఆసక్తికరంగా మారింది.



కరచాలనం చేసుకుంటున్న ఎంపీ చామల, ఎమ్మెల్యే పల్లా

# అదుపు తప్పి ఆటో బోల్తా .. ముగ్గురు మహిళలకు గాయాలు

బెజ్జంకి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అదుపు తప్పి ఆటో బోల్తాపడి ముగ్గురి మహిళలకు గాయాలైన సంఘటన బెజ్జంకి మండలంలోని దాచారం స్టేజీ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని దేవక్కపల్లికి చెందిన వీవోఏ సౌజన్య, మరో ఇద్దరు మహిళలు శనివారం బెజ్జంకిలో ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ కార్యక్రమానికి వచ్చారు. అనంతరం గ్రామంలో చీరలను పంపిణీ చేసేందుకు ఆటోలో తీసుకొని వెళ్తుండగా దాచారం స్టేజీ వద్దకు వెళ్లగానే ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఆటోలోని ముగ్గురి మహిళలకు గాయాలుకాగా 108 అంబులెన్స్‌లో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



దాచారం స్టేజీ సమీపంలో బోల్తా పడిన ఆటో

# పాఠశాలలో గ్యాస్ లీకై చెలరేగిన మంటలు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

గజ్వేల్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఓ ప్రాథమిక పాఠశాలలో శనివారం పెను ప్రమాదం తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి. సంగుపల్లి ప్రాథమిక పాఠశాలలో వంట చేస్తున్న క్రమంలో గ్యాస్ లీక్ కావడంతో వంటగదికి మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సమయానికి మంటలను ఆర్పి వేయడంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. వంటగదికి పాఠ శాల గదులు దూరంలో ఉండడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో వంటగదిలో వంట సామగ్రి దగ్ధమైంది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు.

# 240 బస్తాల బియ్యం పట్టివేత



రాయపోల్ పోలీస్‌స్టేషన్ వద్ద బియ్యం లోడ్‌తో డీసీఎం

రాయపోల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): డీసీఎం వ్యానులో బియ్యాన్ని తరలిస్తుండగా పెట్రోలింగ్ పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన రాయపోల్ మండలం గుర్రాలసోఫా వద్ద చోటుచేసుకుంది. శనివారం రాత్రి అనుమానాస్పదంగా ఉన్న డీసీఎం వ్యానును ఆపి తనిఖీ చేయగా అందులో సుమారు 240 బస్తాల బియ్యం ఐదు టన్నులకు పైగా ఉన్నట్లు గుర్తించారు. డ్రైవర్ సరైన సమాధానం ఇవ్వకపోవడంతో బియ్యంతో పాటు వ్యానును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పౌర సరఫరాల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చామని పంచనామా అనంతరం కేసు నమోదు చేస్తామని ఎస్సై మానస తెలిపారు బియ్యం శాంపిల్ పరీక్షలకు పంపించామని, రిపోర్ట్ వచ్చిన తరువాత నిర్ణయం తీసుకుంటామని డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి తెలిపారు.

# జర్నలిస్టు కాలనీలో దొంగల హల్‌చల్

- రెండు ఇళ్ల తాళాలు ధ్వంసం
- బైక్, కంప్యూటర్, ఇతర సామగ్రి అపహరణ



జర్నలిస్టులతో మాట్లాడుతున్న ఎస్ఐ అమర్

మెదక్ అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని డబుల్ బెడ్‌రూం జర్నలిస్టు కాలనీలో అర్ధరాత్రి దొంగలు హల్ చల్ చేశారు. వరుసగా రెండు ఇళ్లల్లో చొరపడ్డారు. స్థానికంగా ఈ ఘటన భయాందోళనకు గురి చేసింది. జర్నలిస్టులు శ్రీధర్ ఇంటి తాళం ధ్వంసం చేసి, ఇంట్లోకి చొరబడి గందరగోళం సృష్టించారు. రాజు ఇంటి తాళం పగలగొటి ఏసీ విండ్, కంప్యూటర్ మానిటర్ ఎత్తుకెళ్లారు. శ్రీనివాస్ ఇంటి పక్కన చెట్టు కింద పార్కు చేసిన బైక్‌ను, శ్యాం ఇంటి ఐరన్ రాడ్స్ ఎత్తుకెళ్లారు. దాంతో జర్నలిస్టులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అమర్ సంఘటన స్థలాన్ని చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దొంగలను పట్టుకునే పనిలో పడ్డారు.

సండే స్పెషల్

# ప్లంబర్ల కమాల్‌పూర్..
# పెయింటర్ల షేర్‌పల్లి

● ఇంటికొకరు చొప్పున ఊరంతా వారే
● ఉపాధి కోసం వలస వెళ్లి.. పని నేర్చుకుని తిరిగి వచ్చిన తమ గ్రామస్థులకు దారి చూపిన వైనం
● భవన నిర్మాణ కార్మికులుగా గుర్తించి, బీమా, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి

**మెదక్ జిల్లా నార్సింగి మండలం శేరిపల్లి, సంగారెడ్డి జిల్లా మనూరు మండలం కమలాపూర్ గ్రామాలు నైపుణ్యంతో ప్రత్యేక గుర్తింపు పొందాయి. ఇక్కడివారు ఉపాధి కోసం వలస వెళ్లి, తిరిగి తమ గ్రామస్థులందరికీ పని నేర్పించి, జీవనోపాధి కల్పించడంతో ఆదర్శ గ్రామాలుగా నిలిచాయి.**

-తూప్రాన్/చేగుంట/నారాయణఖేడ్/మనూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి)





మెదక్ జిల్లా శేరిపల్లి పెయింటర్లకు చిరునామాగా మారింది. ఇక్కడ ఊరంతా పెయింటర్లుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. గ్రామంలోని సుమారు 350 నుంచి 400 మంది, ప్రతి ఇంట్లో ఇద్దరు, ముగ్గురు పెయింటర్లు ఈ వృత్తిపైనే ఆధారపడి ఉన్నారు. ఈ గ్రామంలో జనాభా అధికంగా ఉండి, వ్యవసాయ భూమి తక్కువగా ఉండటంతోపాటు, 1998లో కరువు పరిస్థితులు ఏర్పడటం వల్ల గ్రామస్థులు ఉపాధి కోసం ఇతర పనులపై దృష్టి పెట్టాల్సి వచ్చింది. గ్రామానికి చెందిన గజవెల్లి వెంకటేశం మొదటగా హైదరాబాద్‌కు వెళ్లి పెయింటింగ్ పనులు నేర్చుకోగా, ఆ తర్వాత సందిగారి వెంకటస్వామిగౌడ్, కమ్మరి నాగరాజు వంటి వారు శిక్షణ పొంది ఇతరులకు దారి చూపారు. శేరిపల్లి గ్రామస్థులు హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వరకు వెళ్లి పనులు చేస్తుంటారు. గ్రామ సమీపంలోని మిర్జాపల్లి రైల్వేస్టేషన్ నుంచి నిత్యం రైల్లో ఇతర ప్రాంతాలకు పనికి వెళ్లి వస్తుంటారు.

### సౌకర్యాలు కల్పించాలని వినతి

అయితే, ఎత్తైన భవనాలకు పెయింటింగ్ చేసేటప్పుడు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. కాజిపల్లి రాజు, బండారి లింగం వంటి పలువురు గాయాల పాలయ్యారు. అత్యంత శ్రమతో కూడుకున్న ఈ పనిలో ఆరోగ్య సమస్యలు (ఆస్తమా, ఊపిరితిత్తుల సమస్యలు) కూడా ఎదుర్కొంటున్నారు. భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం కల్పిస్తున్న బీమా, బెనిఫిట్స్ రామాయంపేట కార్మికశాఖ అధికారి నిర్లక్ష్యం కారణంగా అందడం లేదని, లేబర్ కార్డులు రెన్యూవల్ కావడం లేదని వారు వాపోతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, పెయింటింగ్ పనుల కోసం అధునాతన యంత్రాలు, పరికరాలు అందజేసి ప్రోత్సహించాలని పెయింటర్లు కోరుతున్నారు.

### ప్లంబర్ల గ్రామం..

సంగారెడ్డి జిల్లా కమలాపూర్ గ్రామం ప్లంబర్లకు నెలవుగా ఉంది. ఈ గ్రామంలోని దాదాపు 100 కుటుంబాల్లో కనీసం ఒకరు చొప్పున ప్లంబర్‌గా ఉన్నారు. దీంతో ఇది ప్లంబర్ల గ్రామంగా గుర్తింపు తెచ్చుకుంది. గ్రామానికి చెందిన మష్నాజీరావు 40 ఏళ్ల క్రితం ఉపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లి ప్లంబర్‌గా శిక్షణ పొందారు. ఆయన స్వగ్రామానికి తిరిగి వచ్చి, గ్రామంలోని అనేక మందికి ఈ పనిని నేర్పించారు. ప్రస్తుతం ఆయన వద్ద శిక్షణ పొందిన 40 మంది ప్లంబర్లుగా, మరో 40 మంది సహాయకులుగా పనిచేస్తూ జహీరాబాద్, నారాయణఖేడ్ ప్రాంతాల్లో పనులు చేస్తున్నారు. ఆధునిక గృహ నిర్మాణాల్లో ప్లంబర్ల అవసరం పెరగడంతో, మష్నాజీరావు చూపిన మార్గంలో గ్రామస్థులు ఉపాధి పొందుతున్నారు. ఈ గుర్తింపు వల్లే మష్నాజీరావు గతంలో సర్పంచ్‌గా కూడా ఎన్నికయ్యారు. చదువుకున్నా ఉద్యోగాలు రాని యువకులు సైతం మష్నాజీరావు స్ఫూర్తితో ప్లంబర్లుగా స్థిరపడి, తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. వెంకట్, సంజీవ్ వంటి యువకులు ఈ వృత్తి తమకు జీవనాధారం అయిందని సంతోషం వ్యక్తం చేశారు.



శేరిపల్లి గ్రామ పెయింటర్లు



### ప్రభుత్వం ఆదుకోవాలి



పెయింటింగ్ పనుల వల్ల వచ్చే ఘాటైన వాసనతో ఊపిరితిత్తులు దెబ్బతినడం, ఆస్తమా లాంటి జబ్బులు వస్తుంటాయి. ప్రభుత్వం వైద్య సహాయం అందించడంతో పాటు, పెన్షన్ సౌకర్యం కల్పించాలి.

- కమ్మరి నాగరాజు, ప్లంబర్

### ప్రభుత్వం ఆదుకోవాలి..



పెయింటర్లుగా పనులు చేస్తున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలి. ఇంత కష్టపడుతున్న ప్రభుత్వ పరంగా గుర్తింపు లేకుండా పోయింది. అధునాతన యంత్రాలు, పరికరాలు అందజేసి, కార్మికులను గుర్తించాలి.పెయింటింగ్ పరికరాలు అందజేస్తు ప్రోత్సహించాలి.

- వెంకటస్వామిగౌడ్, పెయింటర్

### ఎంతోమందికి నేర్పించాను...



తాను ఉపాధి కోసం వలస వెళ్లి, ప్లంబర్‌గా శిక్షణ పొంది స్వగ్రామంలోని అనేక మందికి పని నేర్పించడంతో నాకు గుర్తింపు లభించింది. ప్లంబర్‌గా పొందిన గుర్తింపు వల్లే తాను సర్పంచ్‌గా ఎన్నికయ్యాను.

-మష్నాజీరావు, గ్రామ మొదటి ప్లంబర్

### కుటుంబాలను పోషించుకుంటున్నాం..



గృహాలు నిర్మించుకుంటున్న వారి అవసరాలకు అనుగుణంగా పనులు చేస్తున్నాం. ప్లంబర్‌గా కుటుంబాలను చక్కగా పోషించుకుంటున్నాం.

- దొండిరావు, ప్లంబర్

## గడిపెద్దాపూర్‌లో మొసళ్ల కలకలం

**రెండు చెరువుల్లో ప్రత్యక్షం.. అప్రమత్తంగా ఉండాలని దండోరా**





గడిపెద్దాపూర్‌లోని చెరువుల్లో కనిపించిన మొసళ్లు

అల్లాదుర్గం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌లో వారం రోజులుగా మొసళ్ల కలకలం రేపుతున్నాయి. వారం క్రితం గ్రామ సమీపంలోని పెద్దచెరువులో మొసలి సంచరించడన్ని గ్రామస్థులు గుర్తించారు. తాజాగా గ్రామంలోని చిన్న చెరువులోనూ మొసలి ప్రత్యక్షం కావడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. శనివారం ఉదయం వ్యవసాయ పనులు చేసుకునేందుకు రైతులు చిన్న చెరువు మీదుగా వెళ్తున్న క్రమంలో చెరువులో సంచరిస్తున్న మొసలి వీరి కంటపడింది. వారం క్రితం పెద్ద చెరువులో మొసలి కనిపించిందని, అది చిన్న చెరువులోకి వచ్చిందా? లేక రెండు చెరువుల్లోనూ మొసళ్లు ఉన్నాయా? అని ఆందోళన చెందుతున్నారు. మొసళ్ల సంచారంపై మాజీ ఎంపీటీసీ విఠల్‌రెడ్డి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దండోర వేయించారు

## 24న క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు



మల్లికార్జున్

సిద్దిపేట నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న అండర్ 14 సిద్దిపేట జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు క్రికెట్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి కలకుంట్ల మల్లికార్జున్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణంలోని ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియంలో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 01-09-2011 నుంచి 3108-2013 తర్వాత జన్మించిన వారు అర్హులని, యూనిఫాం, క్రికెట్ కిట్లు, ఇతర క్రీడా సామగ్రితో హాజరు కావాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సిద్దిపేట జిల్లా క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

## భగవన్నామస్మరణతోనే ఆధ్యాత్మిక చింతన

● జగద్గురు శ్రీ సత్యాత్మతీర్థ స్వామి
● వైభవంగా మూల రామ దేవుడు, సీతాదేవి పూజలు

కంది, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భగవన్నామస్మరణతోనే ఆధ్యాత్మిక చింతన లభిస్తుందని జగద్గురు సత్యాత్మతీర్థ స్వామి తెలిపారు. సంగారెడ్డి జిల్లా కందిలో శనివారం జగద్గురు మన్ మధ్వాచార్య మూల మహాసంస్థాన్ శ్రీమద్ ఉత్తరాది మఠాధిశ 1008 సత్యాత్మతీర్థ స్వామిజీ సమక్షంలో మూల రామ దేవుడు, మూల సీతాదేవి పూజలు ఘనంగా నిర్వహించారు. రుక్మిణి పాండు రంగ స్వామి ఆలయ ధర్మకర్తలు దీపక్ దేశ్‌ముఖ్, సునీల్ దేశముఖ్‌ల ఆధ్వర్యంలో జిల్లా బ్రాహ్మణ సంఘం సభ్యులు స్వామీజీకి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామీజీకి భక్తి శ్రద్ధలతో పాదపూజ సేవ చేశారు. ఈ సందర్భంగా సత్యాత్మతీర్థ స్వామి భక్తులు, వేద పండితులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధించారు. కార్యక్రమంలో దీపక్ దేశ్‌ముఖ్, సునీల్ దేశముఖ్ పండితులు మధుసూదన్‌రావ, సురేష్, విజయ్, నవీన్, జిల్లా బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తున్న జగద్గురు సత్యాత్మతీర్థ స్వామి

## కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలి

● ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కళింగ క్రిష్ణకుమార్




మాట్లాడుతున్న కళింగ క్రిష్ణకుమార్

నారాయణఖేడ్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని, అప్పుడే ఉన్నతస్థాయికి ఎదగగలుగుతామని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కళింగ క్రిష్ణకుమార్ అన్నారు. శనివారం ఖేడ్ పట్టణంలోని జీవన్ ఫంక్షన్‌హాల్‌లో ఇంపాక్ట్, లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్యక్తిత్వ వికాస ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు స్థానిక పరిస్థితుల పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు రఫీ, భాస్కర్ యోగి, జాన్, ఐఆర్ఎస్ అధికారి సుధాకర్‌నాయక్, లయన్స్‌క్లబ్, ఇంపాక్ట్ స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన విత్తన చట్టంపై అవగాహన

సంగారెడ్డి రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విత్తన చట్టంపై సంగారెడ్డి కలెక్టరేట్‌లో శనివారం వ్యవసాయ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నూతన విత్తన చట్టం -2025 ద్వారా దేశవ్యాప్తంగా రైతులకు నాణ్యమైన విత్తనాలు, నర్సరీ మొక్కలు అందుబాటులోకి తేవాలన్నారు. నకిలీ విత్తనాల నియంత్రణ, విత్తనాల దిగుమతుల సరళీకరణ, రైతుల హక్కుల పరిరక్షణ లాంటి అంశాలకు ప్రాధాన్యమిచ్చినట్టు తెలిపారు. ఉల్లంఘనలు జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టంలో పలు నిబంధనలు చేర్చినట్టు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, రైతు విజ్ఞాన కేంద్ర కో ఆర్డినేటర్ రాహుల్ విశ్వకర్మ, మంజీర రైతు సంఘం అధ్యక్షుడు పృథ్వీరాజ్, రైతు రక్షణ సమితి అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, సీడ్ సర్టిఫికేషన్ విభాగం డైరెక్టర్ శివప్రసాద్, హార్టికల్చర్ అధికారిణి స్పందన తదితరులు పాల్గొన్నారు.




నూతన విత్తన చట్టంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ జేడీ శివప్రసాద్

### విద్యార్థికి యువ శాస్త్రవేత్త అవార్డు



శాస్త్ర వేత్త అవార్డును అందుకుంటున్న విద్యార్థి

పాపన్నపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : పాపన్నపేట మండలం చీకోడ్ - లింగాయిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థికి యువశాస్త్ర వేత్త అవార్డు లభించింది. పదో తరగతి విద్యార్థి శివచైతన్య రూపొందించిన మోడ్రన్ మల్టిపర్పస్ అడ్వాన్స్ హైడ్రాలిక్ అనే ఆవిష్కరణ ఇటీవల ఎన్‌సీఆర్టీ ద్వారా జాతీయ స్థాయికి ఎంపికైంది. ఈ మేరకు శనివారం మధ్యప్రదేశ్ భోపాల్‌లో నిర్వహించిన ప్రదర్శనలో పాల్గొని ప్రతిభ కనబర్చి 'పర్యావరణ్ సంస్కృతి సంరక్షణ్, ఎవం మానవ్ కల్యాణ్ ట్రస్ట్' నుంచి యువ శాస్త్రవేత్త అవార్డు అందుకున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థిని, గైడ్ ఉపాధ్యాయుడు కిషన్ ప్రసాద్‌ను ఉపాధ్యాయ బృందం, మండల వాసులు అభినందించారు.

**క్రైం కార్నర్**

## ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడి మృతి



శ్యామ్ (ఫైల్)

మద్దూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మద్దూరు మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన సింగారం చంద్రయ్య పెద్ద కుమారుడు సింగారం శ్యామ్(29) కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి తన బైక్‌పై ఇంటి నుంచి మద్దూరులోని చౌరస్తాకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో ఎస్సీకాలనీ సమీపంలో రోడ్డు మధ్యలో నిలిపి ఉంచిన లద్నూరు గ్రామానికి చెందిన అప్పాల సురేష్‌కు చెందిన ట్రాక్టర్‌ను ప్రమాదవశాత్తు ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన అతడిని మొదట చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం సిద్దిపేటలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

### కుటుంబ సభ్యుల, బంధువుల ధర్నా



చౌరస్తాలో మృత దేహంతో ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులు

ఎలాంటి హెచ్చరికలు లేకుండా రోడ్డుపై ట్రాక్టర్‌ను నిలిపి శ్యామ్ మృతి కారణమైన ట్రాక్టర్ యజమానిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు మద్దూరు అమరవీరుల స్థూపం చౌరస్తాలో ధర్నాకు దిగారు. సమాచారం అందుకున్న హుస్నాబాద్ ఏసీపీ సదానందం, చేర్యాల సీఐ శ్రీను, ఎస్‌ఐ షేక్ మహబూబ్ అలీ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని చేరుకుని ఆందోళన చేస్తున్న శాంతింపజేసే ప్రయత్నం చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, లేదంటే ట్రాక్టర్ యజమానిని తమకు అప్పగించాలంటూ బైఠాయించారు. ట్రాక్టర్ యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ షేక్ మహబూబ్‌అలీ హామీ ఇచ్చారు. తహసీల్దార్ రహీం మృతుడి కుటుంబానికి ప్రభుత్వం నుంచి రెండు ఎకరాల భూమితో పాటు ఫ్యామిలీబెనిఫిట్ స్కీం వర్తింప జేయనున్నట్లు హామీ ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు.

## భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని.. మేనల్లుడిని కారుతో ఢీ కొట్టి చంపిన మామ

కుకునూరుపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే కోపంతో ఓ మేనమామ.. సొంత మేనల్లుడిని కారుతో ఢీ కొట్టి హత్య చేశాడు. సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లిలో శనివారం సాయంత్రం జరిగిన ఈ ఘటన వివరాలు ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. జిల్లాలోని జగదేవ్‌పూర్ మండలం చాట్లపల్లి గ్రామానికి చెందిన ఒకరి భార్యతో అతని సొంత మేనల్లుడు షాహీద్(26) తరచూ ఫోన్‌లో మాట్లాడేవాడు. దీంతో తన భార్యకు, అతనికి మధ్య వివాహేతర సంబంధం ఉందని మామ తెలువడంతో మానుకోవాలని పలుమార్లు మేనల్లుడి హెచ్చరించాడు. అయినా మానుకోకపోవడంతోపాటు మరో వైపు భార్య కూడా తన భర్తను దగ్గరికి రానివ్వకపోవడంతో మేనల్లుడిని ఎలాగైనా అంతం చేయాలని పథకం వేశాడు. షాహీద్ శనివారం సాయంత్రం కూడా తన అత్తను కలిసి బయటకు వెళ్తుండగా మామ గమనించాడు. అనంతరం షాహిద్ బైక్‌పై కుకునూరుపల్లి మండలం చిన్నకిష్టాపూర్‌నకు రాగా, మామ కారులో వేగంగా వచ్చి ఢీ కొట్టి చంపేశాడు. ఈ మేరకు షాహీద్ కుటుంబసభ్యులు కుకునూరుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. షాహీద్ అవివాహితుడు కాగా, నిందితుడికి ఓ పాప, ఓ బాబు ఉన్నారు.

## సుపారీ గ్యాంగ్‌తో హత్యకు ప్లాన్

● ఎనిమిది మంది అరెస్టు
● వివరాలు వెల్లడించిన ఏసీపీ రవీందర్ రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రవీందర్ రెడ్డి

సిద్దిపేట క్రైం /సిద్దిపేటరూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పొలం దారి విషయంలో చోటుచేసుకున్న గొడవ చివరికి వ్యక్తిని హత్య చేసేవరకు వెళ్లింది. సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెల్లి గ్రామానికి చెందిన మాజీ సైనికుడు పోలీస్ శ్రీనివాస్‌రెడ్డికి అదే గ్రామానికి చెందిన పుల్లగుర్ల యెల్లారెడ్డితో పొలం వద్ద దారి విషయంలో భూ వివాదాలు జరుగుతున్నాయి. గ్రామంలో పంచాయితీలు జరిగినప్పటికీ సమస్య కొలిక్కి రాకపోవడంతో శ్రీనివాస్‌రెడ్డి యెల్లారెడ్డిని చంపాలని నిర్ణయించుకుని ఆ విషయాన్ని తన బంధువు సాగర్, అతని స్నేహితుడు భరత్‌కు చెప్పాడు. వారు ఇర్కోడుకు చెందిన పరశురాములును పరిచయం చేయగా హత్యకు ప్లాన్ చేశారు. ఈ మేరకు పరుశరాములకు విడుతలవారీగా రూ.10 లక్షలను ఇచ్చాడు. పరశురాములు తనకు పరిచయం ఉన్న ఫజిల్, కాస స్వామిలను సంప్రదించి యెల్లారెడ్డిని కారు యాక్సిడెంట్‌లో హత్య చేయాలని చెప్పి రూ.2 లక్షలను అందజేసాడు. వారితో పాటు అనిల్, అంజిబాబు, దుర్గాప్రసాద్, మల్లికార్జున్ డ్రైవర్లను జత కలుపుకున్నారు. వారికీ ముందస్తుగా డబ్బులు చెల్లించి కారును అద్దెకు తెప్పించి అక్టోబర్ 22 రాత్రి రెండు ప్రయత్నాలు చేసి విఫలమయ్యారు. మూడవసారి యెల్లారెడ్డి బైకును వెనుక నుంచి ఢీ కొట్టినా అతడు బతికి బయటపడడంతో కారును అంజిబాబు ఇంట్లో దాచారు. తిరిగి శనివారం ఉదయం పరశురాములు, స్వామి, ఫాజిల్, శ్రీనివాస్‌రెడ్డి కలిసి మళ్లీ యెల్లారెడ్డిని చంపే ప్లాన్ చేస్తుండగా పోలీసులు దాడి చేసి వారితో పాటు అందులో సంబంధం ఉన్న జక్కుల దుర్గాప్రసాద్, అనిల్, పిల్లిట్ల అంజిబాబు, మేఘరాజు మల్లికార్జున్‌లను అరెస్టు చేశారు. ఇర్కోడుకు చెందిన సాగర్, భరత్‌లు పరారిలో ఉన్నట్లు తెలిపారు. పట్టుబడ్డ వారి నుంచి 8 ఫోన్లు, మారుతి కారును స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో సీఐ శ్రీను, ఎస్‌ఐ రాజేష్, సిబ్బంది రాజు, సుభాష్, విష్ణు, ప్రవీణ్, రాజు తదితరులు పాల్గొన్నారు

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



మధు (ఫైల్)

చేగుంట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నార్సింగ్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. నార్సింగ్ ఎస్సై సృజన స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఎరుగ మోల్ల మధు(38) కుటుంబ పోషణ కోసం చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపం చెంది ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు మృతుడికి భార్య శ్యామల, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. భార్య శ్యామల ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సంక్షిప్తం

### నేడు విద్యుత్ అంతరాయం

సిద్దిపేట రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నారాయణరావుపేట మండలంలో 33కేవీ ఫీడర్ విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం మండలంలోని జక్కాపూర్, మాటిండ్ల, ఇబ్రహీంపూర్ గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీఈ పి.శ్రీనివాస్ తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

### మృతుల కుటుంబాలకు సాయం

ములుగు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన తిగుళ్ల పెంటమ్మ, ఆకుల నరసమ్మ అనే ఇద్దరు మహిళలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఉమ్మడి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మృతుల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ. రూ.10వేల చొప్పున మొత్తం రూ.20 ఆర్థిక సాయం అందజేశారు.

### తల్లికి తలకొరివి పెట్టిన తనయ

చేర్యాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలాయపల్లి గ్రామంలో తల్లికి తనయ తలకొరివి పెట్టింది. కమలాయపల్లి గ్రామానికి చెందిన జక్కుల వెంకవ్వ (80) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మరణించింది. భర్త చంద్రయ్య చాన్నాళ్ల క్రితమే మరణించాడు. వీరికి ముగ్గురు కూతుళ్లు సంతానం. వెంకవ్వ మరణించడంతో చిన్నకూతురు జక్కుల పద్మ తలకొరివి పట్టి అంత్యక్రియలు నిర్వహించింది. గ్రామానికి చెందిన మల్లన్న ఆలయ మాజీ ధర్మకర్త వజ్రోజు శంకరాచారి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి అండగా నిలిచారు.

### పూర్తిస్థాయిలో ఇందిరమ్మ ఇంటిని నిర్మించి ఇవ్వాలి: వంటేరు

గజ్వేల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఇందిరమ్మ ఇంటిని నిర్మించి ఇవ్వాలని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతుందని, ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం చేసుకునే పేదవాడికి ఇప్పటివరకు డబ్బులు జమ కాలేదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఇళ్ల లబ్ధిదారులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే నేరుగా లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటిని నిర్మించి లబ్ధిదారులకు అందించాలని డిమాండ్ చేశారు.

### కోర్టు తరలింపును విరమించుకోవాలి: బీజేపీ

హుస్నాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఉన్న చోటి నుంచి హుస్నాబాద్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టును తరలించే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని శనివారం రెవెన్యూ డివిజన్ కార్యాలయ ఏవోకు బీజేపీ నాయకులు వినతి పత్రం సమర్పించారు. హుస్నాబాద్ పట్టణంలో ప్రజలందరికీ అందుబాటులో ఉన్న కోర్టును ఆటవీ ప్రాంతంలో కొత్తగా నిర్మాణం చేసేందుకు ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసిందని, ప్రస్తుతం ప్రజలకు అందుబాటులో ఉన్న కోర్టును తరలించడం తగదన్నారు. తరలింపు ఆలోచనను మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు బత్తుల శంకర్‌బాబు, నాయకులు విద్యాసాగర్‌రెడ్డి, గాదాసు రాంప్రసాద్, రాజేందర్‌చారి, సాయిరామ్, వరియోగుల అనంతస్వామి, శ్రీకాంత్ ఉన్నారు.

### స్వచ్ఛత-శుభ్రతపై ఇంటింటి సర్వే

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్వచ్ఛత-పరిశుభ్రతపై జాతీయ సేవా పథకం వలంటీర్లు శనివారం ఇంటింటి సర్వే చేపట్టారు. మండలంలోని గాంధీనగర్ గ్రామంలో హుస్నాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరంలో భాగంగా విద్యార్థులు ఇంటింటి సర్వే చేపట్టారు. ఇంటి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మానవతా విలువలు, సైబర్ భద్రత, ఆర్థిక అవగాహన, ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాల పట్ల ప్రజల్ని చైతన్య పరిచారు. ప్రభుత్వ పాఠశాలకు రంగులు వేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ రణధీర్‌కుమార్, ఇన్‌చార్జి హెచ్ఎం సంతోషిణి, ఉపాధ్యాయులు, ఎన్ఎస్ఎస్ వాంటీర్లు ఉన్నారు.

### సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహద పడతాయని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్ఐ లక్ష్మారెడ్డి కోరారు. శనివారం హుస్నాబాద్ మండలం కూచనపల్లి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించారు. కూచనపల్లిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన గ్రామస్థులను ఎస్ఐ అభినందించారు.

### ప్రతిఒక్కరూ సేవాభావాన్ని కలిగిఉండాలి

సిద్దిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):ప్రతిఒక్కరూ సేవా భావాన్ని కలిగిఉండాలని స్థానిక మండల విద్యాధికారి అంజాగౌడ్, టీపీసీసీ సభ్యుడు మద్దుల సోమేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సోలార్ లాన్స్‌కి చెందిన గీతాదినేష్‌లు సోలార్ బల్బులు, నోట్‌పుస్తకాలు, కంపాక్స్‌లను ఉచితంగా అందజేశారు. సోలార్‌వల్ల కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు.

# కోతల కాలం.. యంత్రాలతో జరపైలం

- వరికోత యంత్రాల వైపు రైతుల మొగ్గు
- పని సులువైనా.. వెన్నంటే ప్రమాదాలు
- ముఖ్యంగా వేలాడే విద్యుత్ వైర్లు, స్తంభాలతో జాగ్రత్తలు తప్పనిసరి
- రైతులు అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు


మిరుదొడ్డి మండలంలో హార్వెస్టర్‌తో వరికోతలు

సిద్దిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మొంథా తుపాను కారణంగా వ్యవసాయ పొలాల్లో తడి అరక రైతులు కోతలను ఆలస్యంగా మొదలు పెట్టారు. వరికోత యంత్రం సాయంతో వరికోతలు గంటల వ్యవధిలోనే పూర్తవుతున్నాయి. రైతులు వడ్లను నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. ఇంతవరకు అంతా బాగానే ఉన్నప్పటికీ ప్రస్తుతం వరికోతలు జరుగుతున్నందున పంట కోసే సమయంతో రైతులు ఏమాత్రం ఏమరిపాటుగా ఉన్నా ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. మిరుదొడ్డి మండలంలో సుమారు వేల ఎకరాల్లో వరి సాగుచేశారు.

**ఏమరుపాటుగా ఉంటే..**

పంటకోసే సమయంలో పొలాల్లో విద్యుత్ లైన్లు ఉంటాయి. హార్వెస్టర్లకు విద్యుత్ తీగలు తగిలి ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. ట్రాక్టర్లలో ధాన్యం, గడ్డికట్టలను తరలించేటప్పుడు విద్యుత్ వైర్లకు తగిలి ప్రమాదం జరిగే అవకాశాలు లేకపోలేదు. పొలాల్లో చాలా చోట్ల చేతికందే ఎత్తులో విద్యుత్ వైర్లు ఉంటాయి. ముందుగానేగమనించి జాగ్రత్తలు పాటించాలి. విద్యుత్ స్తంభాలకు దూరంగా హార్వెస్టర్‌ను నడపాలి. ప్రమాదకరంగా వేలాడే విదుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఉంటే ముందుగానే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలి. రైతులు జాగ్రత్తగా లేకపోతే వాహనంతోపాటు ప్రాణ నష్టం సంభవించే అవకాశం ఉంటుంది. కోత కోసం హార్వెస్టర్ పొలాల్లోకి దిగే సమయంలో దారిని గమనించాలి. ఏమాత్రం పట్టుతప్పినా కూడా యంత్రాలు బోల్తా పడే ప్రమాదముంది.

### యంత్రాల వైపే రైతన్న చూపు..

ప్రస్తుతం కూలీల కొరతతో రైతులు యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. రైతులకు కొన్ని గంటల్లోనే ధాన్యం చేతికి వస్తుంది. ప్రమాదాలు జరగకుండా వరికోత మిషన్‌కు అందని పైరును రైతులు కోసి ముందుభాగంలో వేస్తుంటారు. దాదాపు మీటరు దూరంలో ఉండి వరికట్టలను మిషన్‌లో వేయాలి. వరికోత మిషన్ నడుస్తున్నప్పుడు దూరంగా ఉండాలి. కోతల సమయంలో చిన్నపిల్లలను తీసుకుని వెళ్లకూడదు. ట్రాక్టర్‌లో ధాన్యం తీసుకుని వెళ్లేటప్పుడు విద్యుత్ తీగలు తగిలే అవకాశం ఉండడంతో జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చు.

## మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం


బెజ్జంకిలో మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

బెజ్జంకి/నంగునూరు/వర్గల్/సిద్దిపేట రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో శనివారం ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా బెజ్జంకిలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలకు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఇందిరా మహిళా శక్తి చీరలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తూ వారి ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, డీపీఎం విద్యాసాగర్, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో ప్రవీణ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా నంగునూరు మండలం ముండ్రాయి, పాలమాకుల గ్రామాల్లో తహసీల్దార్ మాధవి పాల్గొని మహిళలకు చీరల పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈవో దేశ్‌రెడ్డి ఏపీఎం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. వర్గల్ మండలం వేలూరి పంచాయతీ కార్యాలయం వద్ద మహిళా సంఘాల సభ్యులకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అట్ల సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో చీరలను పంపిణీ చేశారు. సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట మండలాల్లోని ఆయా గ్రామాల్లో మహిళలకు తహసీల్దార్ జింక జయంత్ ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఎంలు, కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## నూతన లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు పోరాటం


ప్రజ్ఞాపూర్‌లోని రాణే పరిశ్రమ గేటు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

గజ్వేల్ రూరల్/ములుగు/చేర్యాల/కొమురవెల్లి, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కులను హరించేలా కేంద్రప్రభుత్వం అమలు చేయ తలపెట్టిన లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ శనివారం జిల్లాల్లోని పలు మండలాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసనలు వ్యక్తం చేశారు. ప్రజ్ఞాపూర్‌లోని రాణే మద్రాస్ లిమిటెడ్ పరిశ్రమ గేటు వద్ద, అలాగే ములుగు మండలం ఆర్అండ్ఆర్ కాలనీ మామిడాల చౌరస్తా వద్ద నూతన కార్మిక కోడ్‌ల అమలును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య ఆధ్వర్యంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. రైతాంగ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని నూతన కార్మిక చట్టాలను రద్దు చేసే వరకు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి యూనియన్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, కార్మికులు పాల్గొన్నారు.

చేర్యాలలో మునిసిపల్ పారిశుధ్య కార్మికులతో కలిసి సీఐటీయూ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్లకార్డులు చేతపట్టి నూతన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఇప్పకాయల శోభ, మండల కన్వీనర్ రేపాక కుమార్, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను హరించే చట్టాల అమలు నోటిఫికేషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలనీ కొమురవెల్లి మండలకేంద్రంలో సీఐటీయూ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ్మలు, రవి, కవిత, చంద్రం,తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నీ మార్పిడి ఆపరేషన్ కోసం ఎల్‌వోసీ అందజేత


కిడ్నీ శస్త్రచికిత్స కోసం బాధితుడికి ఎల్‌వోసీ అందజేస్తున్న నాగపురి కిరణ్‌కుమార్

చేర్యాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడవేరుగు గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబీకుడు జల్లి సాయికిరణ్ కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా చికిత్స కోసం కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ అండగా నిలిచారు. సాయికిరణ్ చిన్న వయస్సులో రెండు కిడ్నీలు దెబ్బతినగా, అతడి తండ్రి కిడ్నీ ఇవ్వడానికి అంగీకరించాడు. కానీ ఆపరేషన్‌కు అవసరమైన ఆర్థికపరిస్థితి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని నాగపురి కిరణ్‌కుమార్ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి కిడ్నీమార్పిడి ఆపరేషన్ కోసం రూ.5లక్షలు ఎల్‌వోసీ మంజూరుచేయించారు. ఈ మేరకు శనివారం ఎల్‌వోసీ పత్రాన్ని కిరణ్‌కుమార్ బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. అలాగే ఊపిరితిత్తుల వ్యాధితో ఇబ్బందులుపడుతున్న వేచరేణి గ్రామానికి చెందిన యాసరేణి అండాలు వైద్యచికిత్స కోసం .2.50లక్షల విలువైన ఎల్‌వోసీ మంజూరు చేయించి అందజేశారు. ఆయన వెంట నాయకులు తాళ్లపల్లి వెంకట్, పర్పాటకం మాధవరెడ్డి, బాగోతం బాలచందర్, దేవనబోయిన సత్యం, తాళ్లపల్లి నర్సయ్య, తాళ్లపల్లి రమేశ్, నాజర్, యాదగిరి, సందీప్, గదరాజు ప్రసాద్, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

### నవోదయ విద్యాలయంలో మోడల్ యూత్ గ్రామసభ

వర్గల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో గ్రామాలలో జరుగుతున్న గ్రామ అభివృద్ధి, తదితర అంశాలపై శనివారం విద్యార్థులు గ్రామ పాలన వ్యవస్థ, వ్యవహారాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మోడల్ యూత్ గ్రామసభలో సర్పంచ్, వార్డు మెంబర్లు, వివిధ విభాగాల ప్రతినిధులు, గ్రామస్థులుగా 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులతో నిర్వహించిన మోడల్ యూత్ గ్రామసభలో పలు అంశాలపై సుమారు 45 నిమిషాల పాటు చర్చ నిర్వహించి పలు తీర్మానాలను ఆమోదించారు. కార్యక్రమానికి ఎంపీవో నిఖిల్‌రెడ్డి, వర్గల్, అవుసులోనిపల్లి పంచాయతీ కార్యదర్శులు సందీప్ రెడ్డి, గీత హాజరయ్యారు. విద్యార్థులలో ప్రజాస్వామ్య వ్యవస్థ, గ్రామ స్వరాజ్యం, గ్రామాభివృద్ధి, నాయకత్వ లక్షణాలపై చక్కటి అవగాహన వస్తుందన్నారు. కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నవోదయ ప్రిన్సిపాల్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

### పాఠశాలలో స్టూడెంట్ కౌన్సిల్

రాయపోల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సమగ్ర శిక్ష ఆదేశాల మేరకు రాయపోల్ ఉన్నత పాఠశాలలో హౌస్ సిస్టం, స్టూడెంట్ కౌన్సిల్‌ను ఏర్పాటుచేశారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, జీవన నైపుణ్యాలు పెంపొందించడమే దీని ముఖ్య ఉద్దేశమని హెడ్‌మాస్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్ హెడ్ బాయ్‌గా ఎన్. నిశాంత్‌ఝురుడ్డి, హెడ్ గర్ల్‌గా కె. పూజను నియమించారు. అలాగే స్పోర్ట్స్, కల్చరల్, గుడ్ కండక్ట్ కెప్టెన్లను ఎన్నుకున్నారు. విద్యార్థులను అబ్దుల్‌కలాం హౌజ్, సీవీ రామన్‌హౌజ్, శకుంతలాదేవి హౌజ్, రవీంద్రనాథ్ ఠాగూర్‌హౌస్‌లుగా విభజించారు.

### ప్రతి ఒక్కరూ వందేమాతరం ఆలపించాలి

కొమురవెల్లి, నవంబర్22(ఆంధ్రజ్యోతి):ప్రధాని మోదీ పిలుపు మేరకు శనివారం బీజేపీ నాయకులు స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ... వందేమాతర గీతం దేశ ప్రజల్లో పోరాట స్ఫూర్తిని నింపి ప్రతీ ఒక్కరిని స్వాతంత్రోద్యమం వైపు నడిపిందన్నారు.కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు స్వరూప, నాయకులు దండ్యాల భిక్షపతి రెడ్డి, నాగరాజు, ఎక్కలదేవి శ్రీనివాస్, రాజుచారి, శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

### వాడిన వస్తు సామగ్రి వేలం: సీపీ

చిన్నకోడూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలోని వాడిన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ బ్యాటరీలు, టెంట్లు, షామియానాలు, డ్యామేజ్ అయిన ఇతర ఇనుప వస్తు సామగ్రిని ఈ నెల 25న చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు శివారులోని సీఏఆర్ హెడ్ క్వార్టర్‌లో వేలం వేయనున్నట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ విజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 25న ఉదయం 10 గంటలకు వేలం జరిగే ప్రదేశానికి వచ్చి పేర్లు నమోదు చేసుకొని వేలంలో పాల్గొనాలన్నారు. వేలం పాట పూర్తి కాగానే వేలం డబ్బులు చెల్లించి వస్తువులను తీసుకొని వెళ్లవచ్చునని సీపీ తెలిపారు. ఏమైనా సందేహాలుంటే (8712667416, 8712667422)ను సంప్రదించాలని సూచించారు.

### ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలి


మంత్రి వివేక్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య

గజ్వేల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ ప్రాంతంలో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వినతిపత్రాన్ని అందజేశారు. గజ్వేల్ పట్టణానికి మంత్రి వచ్చిన సందర్భంగా ఆయనను కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... జిల్లాలో 200 పరిశ్రమలు ఉన్నాయని, వీటి పరిధిలో 50వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని, వీరు ప్రతి నెల ఈఎస్ఐకి లక్షల రూపాయలు జమచేస్తున్నారన్నారు. సంగారెడ్డి, మియాపూర్ వెళ్లాలంటే 200 కిలోమీటర్లు అవుతుందని, సిద్దిపేట జిల్లాలో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వెంట సీఐటీయూ నాయకులు అయిలయ్య, రాజు, శివయ్య, సురేశ్ తదితరులున్నారు.

### కాలభైరవ క్షేత్ర రహదారికి నిధులు మంజూరు చేయాలి


మంత్రి పొన్నంకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న పూజారి శ్రీకాంతాచారి

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలంలోని ఉమ్మాపూర్ గుట్టల్లో అతి పురాతన కాలభైరవ క్షేత్రం అభివద్ధికి నిధులు మంజూరు చేయాలని శనివారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరినట్లు కాలభైరవ క్షేత్రం పూజారి పోలోజు శ్రీకాంతాచారి తెలిపారు. ఇందుకు స్పందించిన మంత్రి కాలభైరవ ప్రాంతాన్ని అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయని తెలిపినట్లు శ్రీకాంతాచారి తెలిపారు.

### పేదింటి ఆడబిడ్డ పెళ్లికి అండగా..


పుస్తె, మట్టెలు అందజేస్తున్న కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం

సిద్దిపేట క్రైం, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలోని నిరుపేద కుటుంబానికి సిద్దిపేట 38వ వార్డు కౌన్సిలర్ అండగా నిలిచారు. ఎన్సాన్‌పల్లికి చెందిన దండు సునీత కుమార్తె సుమలత వివాహానికి కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం పుస్తె, మట్టెలు, అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ ఎంపీటీసీ ప్రశాంత్ గౌడ్ ద్వారా నిరుపేద కుటుంబం వివరాలను తెలుసుకొని వారికి పుస్తే మట్టెలు అందజేసినట్టు తెలిపారు. పేదలకు చేయూతను అందిస్తున్న దంపతులు స్వప్న బ్రహ్మం దంపతులకు ప్రశాంత్ గౌడ్, హరి కృతజ్ఞతలు తెలిపారు. వెంట స్వామి హనుమత్ రెడ్డి, శ్రీకాంత్, అవినాష్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

### ఆకునూరులో వైద్యశిబిరానికి స్పందన


శిబిరంలో ప్రజలకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సుంకరి మల్లేశం

చేర్యాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మాజీ జడ్పీటీసీ సుంకరి సరితమల్లేశం ఆధ్వర్యంలో మేడ్చల్ మెడిసిటీ హాస్పిటల్ సహకారంతో శనివారం మండలంలోని ఆకునూరు గ్రామంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో హాజరయ్యారు. వైద్యబృందం వివిధరకాల వైద్యపరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ సుంకరి మల్లేశం మాట్లాడుతూ పదవిలో ఉన్నా, లేకున్నా ప్రజాసేవకు పాటుపడుతున్నట్టు తెలిపారు.

### పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత


సదస్సులో మాట్లాడుతున్న బాలకృష్ణారెడ్డి

ములుగు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి ఆచరణలో పెట్టాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా మండల కేంద్రంలోని అటవీ కళాశాలలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సౌజన్యంతో నిర్వహించిన పర్యావరణం, వ్యర్థాల నిర్వహణ సమస్యలు, ప్రభావ అంశంపై సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రకృతి వనరులను భవిష్యత్ తరాలకు అందించేలా సుస్థిరాభివృద్ధి జరగాలని, వ్యర్థాలు శాస్త్రీయంగా నిర్వహిస్తే పర్యావరణ సమస్యల్లో సగం పరిష్కారం లభిస్తుందని ఆయన తెలిపారు. విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండి టెక్స్ట్ బుక్ ప్రపంచంలోకి అడుగుపెడితే వికసిత్ భారత్ - రైజింగ్ తెలంగాణ లక్ష్యం సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో సదస్సు కార్యనిర్వాహక కార్యదర్శి డా.ఎన్ ఎస్ శ్రీనిధి, అటవీ కళాశాల అధికారులు, పర్యావరణ నిపుణులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

### బాల్యవివాహాలను నిర్మూలిద్దాం

- చైల్డ్ హెల్ప్‌లైన్ సిద్దిపేట జిల్లా కోఆర్డినేటర్ గణేష్

సిద్దిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలను నిర్మూలించి, బాలలకు బంగారు భవిష్యత్తును అందిద్దామని చైల్డ్ హెల్ప్‌లైన్ సిద్దిపేట జిల్లా కోఆర్డినేటర్ గణేష్ పేర్కొన్నారు. శనివారం మిరుదొడ్డి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో మహిళాశిశు సంక్షేమశాఖ, బాలల పరిరక్షణ విభాగంగా డీసీపీయూ, చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098 ఆధ్వర్యంలో విద్యార్థులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాల్యవివాహాలు చేసుకోవడం ద్వారా జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాల గురించి సమాచారముంటే టోల్‌ఫ్రీనెంబర్ 1098కు ఫోన్ చేసి బాల్య వివాహాలను నిర్మూలించాలని తెలిపారు.

### తెలుగు పాఠ్యాంశాలు, మూలగ్రంథాల ప్రదర్శన


పుస్తకాల ప్రదర్శన, పుస్తకాల వివరాలు వివరిస్తున్న తెలుగు విభాగం

సిద్దిపేట కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల కాలంలోకూడా పుస్తకం శక్తి పుస్తకానిదేనని తెలుగు సహ ఆచార్యుడు డా. మట్టా సంపత్ కుమార్ రెడ్డి అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీకళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో సేవావిస్తరణ కార్యక్రమంలో భాగంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని ఇర్కోడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు పాఠ్యాంశాల మూలగ్రంథాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు తెలుగువాచకాలు, ఉపవాచకాలు, సహపాఠ్యాంశాలకు సంబంధించిన మూలగ్రంథాలను విద్యార్థుల వద్దకు తీసుకపోయి పాఠశాల ఆవరణలోనే తరగతుల వారీగా మూలగ్రంథాలు ప్రదర్శన చేశారు. తెలుగుశాఖ అధ్యక్షుడు డా.మట్టా సంపత్ కుమార్ రెడ్డి మార్గ దర్శకత్వంలో ప్రాచీనకాలపు తాళపత్రాలు, ఆత్మకథలు, మోనోగ్రాఫ్‌లు, సమగ్ర జీవితచరిత్రలు, పాటలు, కథలు, నవలలు, జానపదం, సామెతలు, జాతీయాలు, పొడుపుకథలు, నిఘంటువులు, వివేకానంద, అంబేడ్కర్ ప్రసంగ రచనలు, గోలకొండ వంటి పాత పత్రికలు ఈ ప్రదర్శనలో ఉంచారు. విద్యార్థులు ఉపాధ్యాయులు ఆసక్తిగా పుస్తక ప్రదర్శనను తిలకించారు.

### డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు

గజ్వేల్ రూరల్ నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మహిళా డిగ్రీ కళాశాలలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం చివరి రోజున క్విజ్ వ్యాసరచన వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థినులకు వైస్ ప్రిన్సిపాల్ కమల క్రిస్టియనా బహుమతులు అందజేశారు, కార్యక్రమంలో లైబ్రేరియన్ ఆవులపాటి వేణు, సీనియర్ అధ్యాపకులు కస్తూరి భాయి, డా సుజాత, తదితరులు ఉన్నారు.

### రాజ్యాంగ విశిష్టతపై వ్యాసరచన పోటీలు

హుస్నాబాద్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు శనివారం నియోజకవర్గ జేఏసీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం యొక్క విశిష్టత అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. దేశంలో ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందని ప్రజలకు అవగాహన కల్పించే క్రమంలో భారత రాజ్యాంగం వర్ధిల్లాలని ఈ కార్యక్రమం నిర్వహించామని నియోజకవర్గ జేఏసీ కో ఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు లక్ష్మన్‌గౌడ్, శ్రీదేవి, అస్మాసహిన్, స్వాతి, అంజలి, వెంకన్న, అశోక్, నిర్మల దేవితో పాటు పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

### గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

సిద్దిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్‌ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మిరుదొడ్డి మండలం అందె గ్రామంలో ఎన్ఆర్ఐఈజీఎస్ నిధులు రూ. 10లక్షలతో సీసీరోడ్ల నిర్మాణానికి, మురికికాల్వల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం గ్రామంలో రూ. 8లక్షలతో అంగన్‌వాడీ భవనానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్, కిష్టయ్య, రాములు, రాజు తదితరులున్నారు.

## సర్కారీ ఉద్యోగుల సిండికేట్..!

(5వ పేజీ తరువాయి)

జిల్లాలోని ఓ మండల విద్యాధికారి ఇదేదో ఉద్యోగ ధర్మంలో భాగమైనట్లు పచ్చ సిరాతో సంతకం చేసి, పక్కన తన హోదా కూడా పేర్కొన్నారు.

**సోషల్‌మీడియాలో ఒప్పంద పత్రం**

2024 సంవత్సరానికి సంబంధించి దుబ్బాకలోని నాలుగు వైన్స్‌లను దక్కించుకున్న వారు సిండికేట్‌గా మారారు. వారు వైన్స్‌ల నిర్వహణ, బెల్ట్ షాపులకు ఎవరు మద్యం సరఫరా చేయాలి, బెల్ట్‌షాపులకు ఉద్దెర ఇచ్చిన బాకీ ఎవరు వసూలు చేయాలి.. వైన్స్‌ను అనుబంధంగా పర్మిట్‌రూంల నిర్వహణ ఎలా... అన్ని వివరాలను ఓ పది రూపాయాల బాండ్ పేపర్‌పై రాసుకుని నలుగురు సిండికేట్ సభ్యులు సంతకాలు చేశారు. ఈ పేపర్‌పై పలువురు సాక్షి సంతకాలు కూడా చేశారు. అప్పట్లోనూ కొందరు ఉద్యోగులు ఈ సిండికేట్ వెనుక ఉండి నడిపించినట్లు సదరు బాండ్ పేపర్ చూస్తే అర్థం అవుతుంది. భాగస్వాముల మధ్య వివాదాల నేపథ్యంలో ఇప్పుడా బాండ్ పేపర్ దుబ్బాక సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

**ఉన్నతాధికారుల పైరవీలు**

సిద్దిపేట జిల్లాలో మొత్తం 91 మద్యం దుకాణాలు ఉండగా, ఇందులో ఎక్కువ మంది ఉద్యోగులు తమ బినామీల పేరిట షాపులు దక్కించుకున్నారు. షాపులు దక్కని వారు లక్కీ డ్రాలో షాపు వచ్చిన వారికి గుడ్‌విల్ ఇచ్చి మరీ భాగస్వాములుగా చేరడమో.. షాపు మొత్తాన్ని సొంతం చేసుకోవడమో చేసినట్లు తెలుస్తోంది. వినని వారుంటే జిల్లాలోని ఎక్సైజ్ ఉన్నతాధికారులతో భాగస్వాములుగా అయినా చేర్చుకోవాలని పైరవీలు చేయడంతో పాటు ఒత్తిడి తీసుకువస్తున్నట్లు సమాచారం. గతంలో షాపులు నిర్వహించిన అనుభవం ఉండటంతో లావాదేవీలు సక్రమంగా సాగుతాయని, కేసుల గోల ఉండదని నయానో.. భయానో అంగీకరింపజేస్తున్నట్లు తెలుస్తోంది.

**ఎక్కడలేని విధంగా డిప్యూటేషన్లు**

జిల్లాలోని కొందరు ప్రభుత్వ ఉద్యోగులు సైడ్ బిజినెస్‌లు చేసుకునేందుకు వీలుగా ఇక్కడే తిష్ట వేస్తున్నారు. ఎక్కడికి బదిలీ చేసినా తిరిగి జిల్లాకే డిప్యూటేషన్‌పై వస్తున్నారు. జిల్లాలోని ఓ శాఖలో సుమారు 300 మందికిపైగా డిప్యూటేషన్‌పైనే కొనసాగుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.